4) -డున్: ఆనంతర్యార్థకం (post-action (meaning `after'))

5) -∅- (~ న్) : తద్ధర్మార్థక ధాతుజ విశేషణం (habitual adjective)

6) (ఎ) -దు- (~/ద్ ~ /డ్): తద్ధర్మార్థకం (habitual tense)
(బి) ~ -తు-
(సి) ∞ – ద్-
(డి) -టి- : భూతకాలం (past tense)

## 4.2.1.2 రెండవ తరగతి- తాలవ్యాచ్చు ఆదిగా గల ప్రత్యయాలు

1) (ఎ) -ఇ-: భూతకాలం (past tense)
(బి) -ఎ-
(సి) -ఇతి-

2) -ఇ: క్త్వార్థకం (past participle)

3) -ఇన(~ /న ∞ /అ): భూతార్థక ధాతుజ విశేషణం (past adjective)

4) -ఇనన్ (~ /నన్/∞ అన్): చేదర్థకం (conditional)

5) -ఎడు-/-ఎడి-/-ఎద-: తద్ధర్మార్థకం (habitual tense)

6) -ఎడు-/-ఎడి-: తద్ధర్మార్థక ధాతుజ విశేషణం (habitual adjective)

## 4.2.1.3 మూడవ తరగతి- కంఠ్యాచ్చు ఆదిగాగల ప్రత్యయాలు

1) -అన్ (~ న్): అన్నంతం (infinitive)

2) అ ( ~ ∅): వ్యతిరేకార్థకం (negative tense)

3) -అక్- (~క్): వ్యతిరేక ప్రార్థనాద్యర్థకం(వ్యతిరేకార్థ-అ-కి సపదాంశం)
(negative imperative (allom. of negative -a-)

4) -అక (~క): వ్యతిరేక క్త్వార్థకం (negative participle)

5) -అని (~ని): వ్యతిరేక ధాతుజ విశేషణం (negative adjective)

6) -ఉ- (~∅): విధ్యాశీరర్థకం (మ.పు.ప్రత్యయాలముందు) (imperative-benedictive (before the 2nd person suffixes) (Krishnamurti, 1972:203)

## 4.2.2 ధాతుగత వర్ణ పరిణామ సూత్రాలు

వివిధ తరగతులకు చెందిన ధాతువులకు ఆయా కాల-భావ బోధక ప్రత్యయాలు పరమైనపుడు పొందే సంధిగత మార్పులను విశ్లేషిస్తూ కృష్ణమూర్తి(1972:203-205) ప్రధానమైన ఆరు సూత్రాలను ప్రతిపాదించారు.

### 4.2.2.1 ఒకటో సూత్రం

'అజాది ప్రత్యయాలు పరమైనపుడు ధాత్వంత అచ్చు లోపిస్తుంది. దీన్ని ఇలా చెప్పవచ్చు. -v1+v2- >-v2- (v1=ధాత్వంత అచ్చు v2=ప్రత్యయాది అచ్చు)'

("Stems having a final vowel before a consonant have alternants without it before another vowel. In other words, -v1+v2- >-v2- (v1 base-final vowel; v2 the vowel beginning a suffix")

ఉదా. కట్టు-చున్ (మొదటి వర్గ ప్రత్యయాలు-1)
కట్ట్-ఇ (రెండవ వర్గ ప్రత్యయాలు-2)
కట్ట్-అన్ (మూడవ వర్గ ప్రత్యయాలు-1)

ఇక్కడ "కట్టు" ధాతువు 'కట్టు-కట్ట్' అని రెండు విధాలుగా ప్రవర్తిల్లుతుంది. 'కట్టు' అనేది మొదటి తరగతి ప్రత్యయాలముందు, 'కట్ట్' అనేది రెండవ, మూడవ తరగతి ప్రత్యయాలముందు ప్రవర్తిల్లుతుంది.

## 4.2.2.2 రెండవ సూత్రం

'త్ర్యక్షర ధాతువులలో మూడవ అచ్చుగా అగ్రాచ్చు ఉంటే('ఇ' లేక 'ఎ') దానిలో రెండవ అచ్చుగా 'ఉ' ఉంటే అది 'ఇ'గా మారుతుంది. అంటే (C)VCuC-i/e- > (C)VCiC-i/e- గా మారుతుంది.'

("In trisyllabic bases, u of the second syllable alternates with i, when a front vowel (i or e) occurs in the following syllable, i.e.,(C)VCuC-i/e- > (C)VCiC-i/e-;")

ఉదా. అడిగ్-ఇ (అడుగు-ధాతువు; ఇ- క్త్వార్థ ప్రత్యయం (రెండవ తరగతి ప్రత్యయం))

ఇతరత్ర: అడుగు-చున్ (మొదటి తరగతి ప్రత్యయం-1)
అడుగ్-అన్ (మూడవ తరగతి ప్రత్యయం-1)

'1, 2వ సూత్రాలద్వారా ఏదైనా త్ర్యక్షర ధాతువు దాని మధ్యాక్షరం 'ఉ' అయితే దానికి కనీసం మూడు సపదాంశాలు ఉంటాయి.'

కింది ఉదాహరణల్లో వాటిని గుర్తించవచ్చు.

'అడుగు - హలాది ప్రత్యయం ముందు (మొదటి తరగతి ప్రత్యయాలు)
అడిగ్ - ఇ/ఎల ముందు (రెండవ తరగతి ప్రత్యయాలు)
అడుగ్ - ఇ/ఎలకు ఇతరమైన అజాది ప్రత్యయాల ముందు (మూడవ తరగతి ప్రత్యయాలు)'

## 4.2.2.3 మూడవ సూత్రం

'రెండవ విభాగానికి చెందిన అగ్రాచ్చులు ఆదిగాగల ప్రత్యయాలు పరమైనపుడు -యు/-య్ అంతంలో ఉన్న ధాతువుల యకారం సకారంగా మారుతుంది. అంటే -య్+ఇ/ఎ- > -స్+ఎ-/-స్+ఇ-'

("Stems which have final yu/y elsewhere, have regular alternants in final s before a front vowel of the B-suffixes, i.e., -y+i/e- > -s+i-/-s + e-;")

ఉదా. కాస్-ఇ (ఎండ, వెన్నెల)

ఇతరత్ర: కాయు-/కాయ్-

'-యు' అంతంలో ఉన్న ధాతువుకి మూడు రూపాంతరాలుంటాయి.'

("A base ending in -yu has therefore three alternants as in the following examples;")

'కాయు-కలియు- హలాది ప్రత్యయాల ముందు (మొదటి తరగతి ప్రత్యయాలు)

కాస్-, కలిస్- ఇ/ఎల ముందు (రెండవ తరగతి ప్రత్యయాలు)

కాయ్-, కలియ్- ఇ/ఎ లకంటే ఇతరమైన ప్రత్యయాలముందు (మూడవ తరగతి ప్రత్యయాలు)'

## 4.2.2.4 నాల్గవ సూత్రం

'-చు' చివర కలిగిన ధాతువుల్లోని -చు తద్ధర్మార్థక ప్రత్యయాలైన /తు ~ త్/ముందు లోపిస్తుంది.' తక్కిన హలాది ప్రత్యయాలముందు లోపించదు. 'అలాగే -చ్చు చివర కలిగిన ధాతువుల్లోని -చ్చు /తు ~ త్/ల ముందు త్ గా మారుతుంది. ఇతర హలాది ప్రత్యయాలముందు -చ్చు త్ గా మారదు. కింది సమీకరణం ఈ అంశాన్ని మరింత స్పష్టపరుస్తుంది.'

-చు+దు(~ ద్-) > -తు-(~-త్-)
-చ్చు+దు-(~ ద్-) > -త్తు-(~-త్త్-)

"All stems having final cu before other consonants, have alternants without it before the alternants /tu-t/ of the habitual tense...stems having final ccu before the other consonants, have alternants in final t before /tu~t/ the alternation may be stated more economically in terms of the following process:"

-cu+du- (~ d-) > -tu(~ -t-)
-ccu+du- (~ d-) > -ttu- (~-tt-)"

ఉదా. 'పిలు-తు-ను; పిలు-త్-అము (ఉభయ సంప్రార్థనార్థకం)
(మూలధాతురూపం 'పిలుచు')

పుత్-తు-ను; పుత్-త్అము (ఉభయ సంప్రార్థనార్థకం)
(మూలధాతురూపం 'పుచ్చు')'

-చు తో అంతమయ్యే ధాతువులకు తకారాద్య ప్రత్యయం పరమైనపుడు ధాతువు చివరి -చు లోపిస్తుంది. -చ్చుతో అంతమయ్యే ధాతువులకు తకారాద్య ప్రత్యయం పరమైనపుడు ధాతువు చివరి -చ్చు, త్‌గా మారుతుంది.

ఈ సూత్రంలో కృష్ణమూర్తిగారు వివరించినట్టుగా /తు ~ త్/ ప్రత్యయాలను /దు ~ ద్/లకు పర్యాయ రూపాలుగా గ్రహించలేదు.

/దు~ద్/లను మాత్రమే గ్రహించి, ధాతుగత చవర్ణంతో ఇవి కలిస్తే రెంటి స్థానాల్లోనూ /తు~త్/లు వస్తాయని వివరించబడింది.

చు/చ్చు చివరగల ధాతువులకు తద్ధర్మార్థక/భవిష్యత్కాల ప్రత్యయమైన -దు పరమైనపుడు ఆ ప్రత్యయ దకారం తకారంగానూ, ధాత్వంత చు, చ్చులు క్రమంగా 0, తకారాలుగా మారతాయి.

అంటే;

చు+దు=తు

చ్చు+దు=త్తు గా మారతాయి.

ఉదా. చూచు-దు-రు=చూ∅-తు-రు= చూతురు (2:4182, 4:511)

వచ్చు-దు-రు=వత్-తు-రు=వత్తురు (2:4295, 3:1753)

## 4.2.2.5 అయిదవ సూత్రం

'చివర 'న్(ఉ)' వర్ణం కల (-న్(ఉ)కు హ్రస్వాచ్చు ముందుండి) ధాతువులకు భూతకాల ప్రత్యయమైన -ట్-, తద్ధర్మార్థక ప్రత్యయమైన -డ్- పరమైనపుడు ధాతువు చివరి 'న్' 'ణ్'గా మారుతుంది. అంటే; -న్+ట్- - ణ్ట్ > - న్+ణ్డ్-' గా మారుతుంది.'

("Stem alternants in final n(u)(preceded by a short vowel) have alternants in before the past tense allomorph - and the habitual tense allomorph -d-...; i.e. -n+t- >nt- and n+d- > -nd-")

ఉదా. 'అన్-టి-ని: అణ్-డ్-రు

ఇతరత్ర: అను-లేక అన్-"

## 4.2.2.6 ఆరవ సూత్రం

'దీర్ఘాచ్చుగానీ హ్రస్వాచ్చుగానీ చివరఉన్న ఏకాక్షర ధాతు రూపాలకు మూడవ తరగతి ప్రత్యయం పరమైనపుడు ప్రత్యయాది అచ్చు లోపిస్తుంది."

("After monosyllabic stem-alternants in final long or short vowels, all C-suffixes have alternants without the initial vowel.")

'రా+అన్/రా> న్(మూడవ తరగతి ప్రత్యయం-1)

ర+ఉమ్ము > రమ్ము

ర+ఉడు+ ం > రండు

రా-/ర- = వచ్చు ధాతువుయొక్క సపదాంశం'

## 4.2.3 ధాతు వర్గాలు

ప్రత్యయాలు చేరేపుడు తెలుగు క్రియా ధాతువులు కొన్ని మార్పులకు లోనవుతాయి. ఈ మార్పుల ఆధారంగా కృష్ణమూర్తి(1972:205-210) ప్రాచీ నాంధ్రంలోని ధాతువులను అయిదు వర్గాలుగా వర్గీకరించారు. వీటిలో ఐదో వర్గ ధాతువులు ఆయా తరగతుల ప్రత్యయాల ముందు అనియత మార్పులు పొందుతాయి. కాబట్టి ఈ అధ్యయనంలో వీటిని 'అనియత మార్పులు పొందే ధాతువర్గం' అన్న ఉపవిభాగంగా పేర్కొనడమైంది.

1) మొదటి వర్గం

(i) (c)vcv - చాటు (1:1188)

(ii) (c)vccv - నవ్వు (1:1211)

(iii) (c)vcvcv - మరుగు (1:3195)

(iii) (c)vcvcv - పలుకు (1:5688)

2) రెండవ వర్గం

-చు/-చ్చుతో అంతమయ్యే ధాతువులు

ఎంచు (2:7280)
మెచ్చు (2:7566)

3) మూడవ వర్గం

-యు/-య్యుతో అంతమయ్యే ధాతువులు

(i) ద్వ్యక్షర ధాతువులు

చేయు(2:985 తర్వాతి వచనంలో)

(ii) త్ర్యక్షర ధాతువులు

తెలియు (3:5581)
జడియు (6:2477)

4) నాల్గవ వర్గం

నాల్గవ వర్గ ధాతువులను రెండు ఉపవర్గాలుగా విభజించవచ్చు.

(i) అన్వాదులు(ఎనిమిది) (ii) పడ్వాదులు(మూడు)

(i) 1. అను (6:237)
2. కను (చూచు) (6:2727)
3. కను (ప్రసవించు) (2:5832)
4. కొను (2:6702)
5. చను (2:6803)
6. తిను (5:2053)

7. మను (5:4022)
8. విను (5:4145)

(ii) 1. పడు (6:125)
2. చెడు (6:4914)
3. ఇడు (6:792)

5) అనియత మార్పులు పొందే ధాతువర్గం

ఆయా తరగతుల ప్రత్యయాల ముందు అనియత మార్పులు పొందే ధాతువులన్నీ ఈ వర్గం కిందకి వస్తాయి. ఈ వర్గానికి సంబంధించిన పదకొండు ధాతువులు శ్రీరామాయణంలో ఉన్నాయి.

1. అగు (2:8431)
2. ఇచ్చు (2:9197)
3. ఉండు (1:615)
4. చూచు (1:799)
5. చొచ్చు (1:3165)
6. తెచ్చు (2:4141)
7. పోవు (2:4257)
8. లేచు (3:5224)
9. వచ్చు (3:5377)
10. వలచు (3:5888)
11. కల (2:1179)

## 4.2.4 ఆయా వర్గ ధాతువుల్లో కనిపించే సంధిగత అంశాలు

### 4.2.4.1 మొదటి వర్గం

ఈ వర్గంలోని ద్వ్యక్షర ధాతువులలో(c)vcv, (c)vccv అనే వర్ణ అనుక్రమానికి భిన్నంగా (c)vcv అనే అనుక్రమం కల్గిన ధాతువులు కూడా, కనిపిస్తున్నాయి.

తగు (1:1372)
నగు (1:3307)
తెగు (2:1718)

## 4.2.4.2 రెండవ వర్గం

మూడవ తరగతి ప్రత్యయాలముందు పొందే మార్పులనుబట్టి ఈ వర్గంలోని ధాతువులను కృష్ణమూర్తి(1972:206) నాలుగు ఉప వర్గాలుగా విభజించారు.

1) అంతిమ -చు/-చ్చులు -వు/-వ్వులుగా మారే ధాతువులు

(i) -చు >-వుగా మారటం:

వీచు-అఁ=వీవఁ (5:698)
నిల్చు-అఁ=నిల్వు-అఁ=నిల్వ (6:2769)
నిలుచు-అఁ=నిలువుఁ-ఆఁ=నిలువఁ (6:582)
పిల్చుఁఅన్=పిల్వు-అన్=పిల్వ (2:5777)
పిలుచు-అన్=పిలువు-అన్=పిలువన్ (6:7592)

-అక (వ్యతిరేక క్త్వార్థకం) ముందు:

నిలుచు-అక=నిల్వు-అక=నిలువక (6:8792)
నిల్చు-అక=నిల్వు-అక=నిల్వక (3:680)

-ఉ (విధ్యర్థకం)ముందు:

కాచు-ఉ=కావు-ఉ=కావు (1:1564)

(ii) -చ్చు >-వ్వుగా మారటం:

-చ్చు >-వ్వుగా మారిన రూపాలు శ్రీరామాయణంలో లేవు.

2) అంతిమ -చు/- ంచులు, -పు/- ంపులుగా మారే ధాతువులు

(i) అంతిమ -చు > -పుగా మారటం:

తలచు-పు=తలపు (4:1222)

(ii) అంతిమ - ంచు/- ంపుగా మారటం:

ఈ ఉపవర్గానికి సంబంధించిన సామాన్య ధాతువుల్లో ఇటువంటి మార్పు కనిపించటంలేదు. ఈ ఉపవర్గానికి చెందిన సంశ్లిష్ట ధాతువులో ఈ మార్పు కనిపిస్తోంది.

కౌఁగిలించు-అక=కౌఁగిలింపక (4:2192)

తలంచు-అని=తలంచ్-అని-తలంప్-అని=తలంపని (6:10894)

మూడవ తరగతి ప్రత్యయాల ముందు సంశ్లిష్ట ధాతువులలోని చివరి - ంచు, - ంపు గా మారని రూపం ఒకటి శ్రీరామాయణంలో కనిపిస్తున్నది.

-ఉ(విధ్యర్థకం)ముందు:

అంపించు-ఉ-ము=అంపించ్*-ఉ-ము-అంపించుము (1:1854) (*చూ. 4.2.2.1)

3) అంతిమ - ఁచు, - ఁపుగా మారే ధాతువులు

తలఁచు-అన్=తలఁపు-అన్=తలఁపన్ (2:3329)

-అన్ (అన్నంతం)ముందు:

తలఁచు-అన్=తలఁచ్*-అన్=తలఁప్-అన్=తలఁపన్ (2:3329) (*చూ. 4.2.2.1)

-అ (వ్యతిరేకార్థకం) ముందు:

తలఁచు-అ-రు=తలఁచ్*-అ-రు=తలఁప్-అ-రు=తలఁపరు (6:1888) (*చూ. 4.2.2.1)

-అక (వ్యతిరేక క్త్వార్థకం) ముందు:

దాఁచు-అక=దాఁచన్*-అక=దాఁప్-అక=దాఁపక (6:4355) (*చూ. 4.2.2.1)

-ఉ(విధ్యర్థకం) ముందు:

తలఁచు-ఉ-ము=తలఁచ్*-ఉ-ము=తలఁప్-ఉ-ము=తలఁపుము (4:1274) (*చూ. 4.2.2.1)

4) మార్పును పొందని ధాతువులు

ఎంచు: ఎంచరు (3:9810)

-అన్ (అన్నంతం) ముందు:

ఎంచు-అఁ=ఎంచ్*-అఁ=ఎంచఁ (2:5840) (*చూ. 4.2.2.1)

-అని (వ్యతిరేకార్థకం) ముందు:

ఎంచు-అ-రు=ఎంచ్*-అ-రు=ఎంచరు (4:5289) (*చూ. 4.2.2.1)

-అని (వ్యతిరేకార్థక విశేషణం) ముందు:

మెచ్చు-అని=మెచ్చ్*-అని=మెచ్చని (4:1959) (*చూ. 4.2.2.1)

## 4.2.4.3 మూడవ వర్గం

1) ఈ వర్గ ధాతువుల్లో ధాతుగత వర్ణ పరిణామ సూత్రాల్లోని 3వ సూత్రం ప్రవర్తిల్లుతుంది. ('రెండవ విభాగానికి చెందిన అగ్రాచ్చులు ఆదిగాగల ప్రత్యయాలు పరమైనపుడు -యు/-య్ అంతంలో ఉన్న ధాతువుల యకారం సకారంగా మారుతుంది. అంటే -య్+ఇ/ఎ- > -స్+ఎ-/-స్+ఇ-')

("Stems which have final yu/y elsewhere, have regular alternants in final s before a front vowel of the B-suffixes, i.e.,-y+i/e- > -s+i-/-s + e-;") (చూ.4.2.2.3)

పై సూత్రం ప్రకారం అగ్రాచ్చులు ఆదిగాగల ప్రత్యయాలు (రెండవ తరగతి ప్రత్యయాలు) పరమైనపుడు ఈ ధాతువుల్లోని -య్/య్య > -స్/-స్సగా మారుతుంది. "ఇకార వక్త్రంబు లుక్తంబులందలివి పరంబులగుచో ఁయాకు సకారంబగు" (బాలవ్యా.క్రియా.:54) అనే సూత్రంలో బాలవ్యాకర్త ఈ అంశం వివరించాడు.

(i) య్>స్ గా మారటం:

చేయు-ఇ-రి=చేయ్*-ఇ-రి=చేస్-ఇ-రి=చేసిరి (6:12245) (*చూ.4.2.2.1)

-ఎద (తద్ధర్మార్థకం) ముందు:

చేయు-ఎద-ము=చేయ్*-ఎద-ము=చేస్-ఎద-ము=చేసెదము (1:2445) (*చూ.4.2.2.1)

-ఇ (క్త్వార్థకం)ముందు:

ఆరయు-ఇ=ఆరయ్*-ఇ=ఆరస్-ఇ=ఆరసి (2:2222) (*చూ.4.2.2.1)

-ఇన (భూతార్థక విశేషణం) ముందు:

నెరయు-ఇన=నెరయ్*-ఇన=నెరస్-ఇన=నెరసిన (2:50018) (*చూ. 4.2.2.1)

-ఎడు, -ఎడి (తద్ధర్మార్థక విశేషణం)ల ముందు:

చేయు-ఎడి=చేయ్*-ఎడి=చేస్-ఎడి=చేసెడి (4:3514) (*చూ. 4.2.2.1)

(ii) య్యు>స్సుగా మారిన రూపాలు (డయ్యు>డస్సి) శ్రీరామాయణంలో లేవు.

2) బాలవ్యాకర్త "చువర్ణంబుతోడ దుగ్ధకారంబు తకారంబగు" (బాలవ్యా. క్రియా.:108) అనే సూత్రానికి రాసిన వృత్తి వచనంలో "చేతురు, కోతు రిత్యాదు లసాధువులని యెఱుఁగునది" అని చెప్పాడు. బాలవ్యాకర్త నిషేధించిన "చేతురు" రూపం శ్రీరామాయణంలో కనిపిస్తోంది.

చేతురు (1:1911)
"జేతురు విఘ్నముల్-శ్రీరాముఁ బనుపు"

## 4.2.4.4 నాల్గవ వర్గం

ఈ వర్గంలోని ధాతువులు అన్వాదులు, పడ్వాదులు అని రెండు ఉప వర్గాలుగా విభజించవచ్చు.

1) అన్వాదులు (ఎనిమిది)

1. అను
2. కను (చూచు)
3. కను (ప్రసవించు)
4. కొను
5. చను
6. తిను
7. మను
8. విను

2) పడ్వాదులు (మూడు)

1. పడు
2. చెడు
3. ఇడు

(i) తక్కిన ప్రత్యయాలతోపాటు కొన్ని విశేష ప్రత్యయాలను గ్రహించటం ఈ ధాతువుల ప్రత్యేక లక్షణం. ఈ ధాతువులు భూతార్థక ధాతుజ విశేషణ ప్రత్యయం -ఇన తోపాటు, -అ/ను, చేదర్థక/ అప్యర్థక ప్రత్యయంగా -ఇనన్‌తో పాటు -అన్‌ను కూడా గ్రహిస్తాయి.

ఉదా.
-ఇ (భూతకాలికం)ముందు:

అను-ఇ-రి=అన్*-ఇ-రి=అనిరి (1:4257) (*చూ. 4.2.2.1)

చను-ఇ-రి=చన్*-ఇ-రి=చనిరి (3:4776) (*చూ. 4.2.2.1)

-ఎ (భూతకాలికం)ముందు:

కను-ఎ-న్=కన్*-ఎ-న్=కనియెన్(న్)(=చూచెను)(1:3787) (*చూ. 4.2.2.1)

-ఇన(భూతార్థక ధాతుజ విశేషణం)ముందు:

అను-ఇన=అన్*-ఇన=అనిన (2:7947) (*చూ. 4.2.2.1)

చను-ఇన=చన్*-ఇన=చనిన (3:2184) (*చూ. 4.2.2.1)